# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ నూతనంగా ఏర్పడిన 18వ లోక్‌సభ సభాపతి ఎన్నిక రేపు జరగనుంది.
- ❖ హంద్రీ-నీవా ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి రాయలసీమకు నీటిని అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- ❖ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలను విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఈరోజు విడుదల చేశారు.
- ❖ బంగాళాఖాతంలో రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది.
- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ ” కార్యక్రమం 111వ సంచిక ఈ ఆదివారం ప్రసారం కానుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = =

నూతనంగా ఏర్పడిన 18వ లోక్‌సభ సభాపతి ఎన్నిక రేపు జరగనుంది. సభాపతిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంలో అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ ఎన్నిక అనివార్యమయింది. గత లోక్‌సభలో సభాపతిగా పనిచేసిన సీనియర్ భారతీయ జనతా పార్టీ పార్లమెంట్ సభ్యులు ఓం బిర్లా ఈసారి కూడా ఎన్‌డిఏ తరపున నామినేషన్ దాఖలు చేశారు. అధేవిదంగా ఇండియా కూటమి తరపున కాంగ్రెస్స్ పార్టీ పార్లమెంట్ సభ్యులు కె.సురేష్ కూడా సభాపతి పదవికోసం నామినేషన్ వేశారు. స్వతంత్ర భారత చరిత్రలో సభాపతి పదవికి ఎన్నిక జరగడం ఇదే మొదటిసారి.

= = = = = = = = = = = = = = = = = = = = = =

కుప్పం నియోజకవర్గాన్ని అభివృద్ధికి నమూనాగా తీర్చిదిద్దుతానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా ఈరోజు హంద్రీనీవా ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కుప్పంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... చిత్తూరు జిల్లాలో అనేక అభివృద్ధి

కార్యక్రమాలు చేపట్టామని, అన్ని రంగాల్లో జిల్లాను మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. హంద్రీ-నీవా ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి రాయలసీమకు తాగు-సాగునీటి కష్టాలు తీరుస్తామన పేర్కొంటూ....

(వాయిస్ 24 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలను విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఈరోజు విడుదల చేశారు. ఫిబ్రవరి 27 నుంచి మార్చి 6 వరకు రెండు పేపర్లుగా నిర్వహించిన ఈ టెట్ పరీక్షకు 2 లక్షల 35 వేల 907 మంది హాజరుకాగా, లక్షా 37 వేల 904 మంది అర్హత సాధించారు. ఈ సందర్భంగా పరీక్షలో అర్హత సాధించిన వారికి సామాజిక మాధ్యమం ద్వారా మంత్రి నారా లోకేష్ శుభాకాంక్షలు తెలియజేశారు. డీఎస్సీకి టెట్ అర్హత కావడంతోపాటు, 20 శాతం వెయిటేజీ ఉండటంతో రాష్ట్ర వ్యాప్తంగా 2.35 లక్షల మందికి పైగా అభ్యర్థులు ఈ ఫలితాల కోసం ఎదురు చూశారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీకి సన్నద్ధమవుతున్న అందరికీ మంచి జరగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ టెట్‌లో అర్హత సాధించని వారు నిరాశకు గురికావొద్దని, వారంతా కొత్తగా బీఈడీ, డీఎడ్ పాసైన అభ్యర్థులతో పాటు అతి త్వరలోనే నిర్వహించబోయే టెట్‌కు, మెగా డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవచ్చని లోకేశ్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి  శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడికి ఈరోజు లేఖ రాశారు. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటే 10 శాతం సీట్లు ఉండాలని చట్టంలో ఎక్కడా లేదని, విపక్షంలో ఎవరికి ఎక్కువ సీట్లు ఉంటే వారికే ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టంలో ఉందని లేఖలో తెలిపారు. ప్రజల తరఫున అసెంబ్లీలో గొంతు విప్పడానికి తగిన సమయం లభించాలనే ఉద్దేశంతో ఈ లేఖ రాస్తున్నానని, ప్రతిపక్ష పార్టీ గుర్తింపుతోనే సభా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు చట్టబద్ధమైన భాగస్వామ్యం లభిస్తుందన్నారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని లేఖను పరిశీలించాలని కోరుతున్నానని జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్, యానాంలో నైరుతి దిశగా బలమైన గాలులు వీస్తున్నాయని, రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ అల్పపీడనం బలపడుతూ... ఉత్తర దిశగా ప్రయాణించే అవకాశం ఉందని పేర్కొంది. రేపు సాయంత్రానికే  అల్పపీడనం ఆంధ్రప్రదేశ్  తీరాన్ని తాకనుందని, దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులూ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాలోని పలు ప్రాంతాలలో భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని తెలియజేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = =

అరకు కాఫీకి సంబంధించి గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా చైన్ షాపులు పెట్టబోతున్నామని గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. ఈరోజు అమరావతిలో మంత్రి మాట్లాడుతూ, భవిష్యత్‌లో అరకు కాఫీని మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, దేశ విదేశాల్లో సైతం ప్రచారం కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. నెలకోసారి గిరిజన హాస్టళ్లల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

గ్రామీణ, గిరిజన ప్రాంతాలతో అనుసంధానమైన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయ అభివృద్ధికి అందరూ ముందుకు రావాలని ఉపకులపతి  ఆచార్య కె.ఆర్.రజని అన్నారు. ఈరోజు శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్

విశ్వవిద్యాలయం 17వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ... ఈ 16 ఏళ్లలో విశ్వవిద్యాలయం ఎన్నో విజయాలను, గుర్తింపులను సాధించిందన్నారు. విశ్వ విద్యాలయంలోని వనరుల్ని వనరులను సద్వినియోగం చేసుకొని, విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్ ను తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ విశ్వవిద్యాలయ సర్వతోముఖాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, స్థానిక పరిశ్రమలు, ఎన్జీవోలు, పూర్వవిద్యార్థులు సహకారం అందించాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో వ్యవసాయానికి సంబంధించి సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రతి ఎకరానికి నీరు అందేలా అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర జల వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. ఈరోజు సచివాలయంలో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, అధికారులతో మంత్రి దృశ్యమాధ్యమ సమాపేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్ లో రైతులకు ఎటువంటి నష్టాలు ఎదురుకాకుండా పంట కాలువలు, మురుగుని తొలగించేలా పది రోజుల్లో పనులు చేపట్టేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో గోదావరి ఏటి గట్ల పటిష్టతకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

విజయనగరం జిల్లా కలెక్టర్ గా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ లో ఆయనకు జిల్లా అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, అన్ని రంగాల్లో అభివృద్ధి మార్గంలో నడిపిస్తానన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యక్రమాలను ముందుకు తీసుకు వెళతామని, గతంలో తాను జిల్లాలో వివిధ హోదాల్లో పని చేశానని, జిల్లా పరిస్థితులపై కొంతవరకు అవగాహన ఉందని కలెక్టర్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

బ్రిటిష్ కాలం నాటి చట్టాలకు కేంద్ర ప్రభుత్వం కాలానుగుణంగా మార్పులు చేసి తీసుకువచ్చిన నూతన నేర న్యాయ చట్టాలు జులై 1 నుంచి అమల్లోకి రానున్నాయని పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.విజయ కృష్ణ తెలిపారు. ఈరోజు ఆయన ఆకాశవాణితో మాట్లాడుతూ... నూతన చట్టాలైన భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్‌లపై కేంద్ర హోంశాఖ ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్లు వెలువరించిందన్నారు. ఈ చట్టాలపై యువ న్యాయవాదులు అవగాహన పెంచుకుని ప్రజలకు సత్వర న్యాయం చేకూరేవిధంగా పనిచేయాలని పేర్కొంటూ....

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = =

సంత్రాగచ్చిలో ఈరోజు సాయంత్రం 5 గంటలకు బయలుదేరాల్సిన సంత్రాగచ్చి- విశాఖపట్నం ప్రత్యేక ఎక్స్ ప్రెస్ రాత్రి 8 గంటల 20 నిమిషాలకు బయలుదేరుతుందని రైల్వే అధికార వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. దీని జత రైలు ఆలస్యంగా నడుస్తున్న కారణంగా ఈ మార్పు చేసినట్లు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్ - మనసులో మాట” కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి “మన్ కీ బాత్” కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28వ తేదీ లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ ద్వారా లేదా, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

======================

======================